RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 04 సంచిక :100 | శుక్రవారం 16-08-2024 | పేజీలు :04 వెల:రూ. 2.00

## హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు కు ఉత్తమ అవార్డు !

సంజామల/ ఆగస్టు 15 శ్రీ ప్రస్థానం న్యూస్: సంజామల హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు ఉత్తమ సేవా వార్డు లభించింది. 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కలెక్టర్ రాజకుమారి సంజామలహౌసింగ్ ఏఈ బాలచంద్రుడు ఉత్తమ సేవ అవార్డు అందుకున్నారు అవార్డు రావడం చాలా సంతోషకరంగా ఉందని పలువురు సంతోషం వ్యక్తం చేశారు.



## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386    85220 22029

Land Line No : 08517 224194

# దెబ్బతిన్న ఏపి బ్రాండ్‌ను నిలబెడతాం



**అభివృద్ధిని పట్టాలకు ఎక్కిస్తున్నాం**
**విధ్వంసం అయిన వ్యవస్థలను గాడిన పెడుతున్నాం**
**అంతర్జాతీయనగరంగా అమరావతి నిర్మాణం**
**15శాతం వృద్ధిరేటు సాధించడమే లక్ష్యం**
**నదుల అనుసంధానం మా ప్రభుత్వ విధానం**
**ఐదేళ్లలో కోల్పోయిన స్వేచ్ఛను ప్రజలకు అందించాం**
**ఉచిత ఇసుక విధానంతో ప్రజలకు మేలు చేసాం**
**తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తి లేదు**
**విజయవాడలో స్వాతంత్ర్య ఉత్సవాల్లో సిఎం చంద్రబాబు**

విజయవాడ,ఆగస్ట్15 : గత ఐదేళ్లలో దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను తిరిగి పొందేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ భ్రష్టు పట్టాయని అన్నారు. మళ్లీ పరిస్థితిని గాడిన పెట్టి, అభివృద్ధిని పట్టాలకు ఎక్కిస్తున్నామని, అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతామని సిఎం చంద్రబాబు ప్రకటించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లుగా ప్రజలు కోల్పోయిన స్వేచ్ఛను అందించేందుకు కట్టుబడి ఉంటాం. ప్రజలకు ఉపయోగపడే విధానాలు రూపొందిస్తున్నాం. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలనకు శ్రీకారం చుట్టాం. 100 రోజుల ప్రణాళిక టార్గెట్‌గా అన్ని శాఖల్లో సమీక్షలు చేస్తున్నాం. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన శాఖల్ని పునరుద్ధరిస్తున్నాం అని వివరించారు. 1857 కంటే ముందే బ్రిటిష్ దుర్మార్గపు పాలనపై తెలుగు నేల తిరుగుబాటు చేసిందని చరిత్రకారులు చెబుతున్నారు.. ఇది చైతన్యం కలిగిన ప్రాంతం. విభజనతో ఏర్పడిన నవ్యాంధ్రకు రాజధాని కూడా లేని పరిస్థితిలో నాడు పాలన ప్రారంభించాం. అటువంటి పరిస్థితి నుంచి ప్రభుత్వాన్ని పట్టాలెక్కించాం. మాకున్న అనుభవం, ప్రజల సహకారంతో కొద్ది కాలంలోనే నిలదొక్కుకున్నాం. 120కి పైగా సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రథమంగా నిలిచాం. రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకుని దేశం దృష్టిని ఆకర్షించాం అని వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం నిర్దిష్ట నిర్ణయాలతో పాలన సాగించబోతున్నాం. నూతన ఆలోచనలతో 15 శాతం వృద్ధిరేటు సాధించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం. దేవుడి దయ వల్ల సాగునీటి ప్రాజెక్టులకు జులైలోనే జలకళ వచ్చింది. కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులన్నీ నిండాయి. సమర్థ నీటి నిర్వహణ ద్వారా అన్ని ప్రాంతాలకు సాగునీరందిస్తాం. రైతు ఆదాయం పెంచి వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం. వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం మా ప్రభుత్వ విధానం. గత ప్రభుత్వ అసమర్థతతో దెబ్బతిన్న పోలవరాన్ని ముందుకు తీసుకెళ్తాం. యువతకు అవకాశాలు సృష్టిస్తే అద్భుతాలు సాధిస్తారు. అందుకే నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టాం. దీంతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభించేలా చూస్తాం. గత ప్రభుత్వం నిర్మాణ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. గత ప్రభుత్వ ఇసుక దోపిడీపై సీఐడీ విచారణ జరిపిస్తాం. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఉచిత ఇసుకపై నిర్ణయం తీసుకున్నాం.

## ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎస్.ఐ. సురేష్



దొర్నిపాడు, ఆగస్టు:15, శ్రీ ప్రస్థానం న్యూస్:- 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా దొర్నిపాడు పోలీస్ స్టేషన్ లో ఎస్.ఐ. గా విధులు నిర్వర్తించే బి.సురేష్,కి గురువారం నంద్యాల జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా రాష్ట్ర ఆర్ ఁబి. పెట్టుబడుల శాఖ మంత్రి వర్యులు శ్రీ బి.సి.జనార్దన్ రెడ్డి,జిల్లా ఎస్పీ. ఆదిరాజు సింగ్ రాణా చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.దొర్ని పాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల్లోని శాంతి భద్రత తో పాటు గా వివిధ కేసులను ఎప్పుడికప్పుడు పరిష్కరించడంమే కాకుండా పలు సేవా కార్యక్రమాలు చేసినందుకు గాను ఎస్.ఐ.సురేష్,కు జిల్లా ఎస్పీ, అభినందిస్తూ ఉత్తమ సేవా అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అంద జేశారు. ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎస్. ఐ. సురేష్,కి ఏ.ఎస్.ఐ. మౌలాలి,ప్రతాప్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్, వెంకట రెడ్డి, సుధాకర్ రెడ్డి, లక్ష్మి నారాయణ, కానిస్టేబుల్ మహబూబ్ పీరా,రాంబాబు, శేఖర్,మల్లికార్జున, హుస్సేన్ హోంగార్డు, వలి, అభినందించారు.

## మంచాలకట్టలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



గడివేముల మండలం మంచాలకట్ట గ్రామ సచివాలయంలో 78 వ భారతదేశ స్వాతంత్ర దినోత్సవం ఆగస్టు 15 న వేడుక లో గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు అనిల్ కుమార్ రెడ్డి మేఘనాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు .ఈ సందర్భంగా మేఘనాథ్ రెడ్డి మాట్లాడుతూ భారతీయులు తమ స్వేచ్ఛ స్వాంతంత్ర్యాలను సంపాదించుకున్నారు. ఈ శుభ సందర్భం కోసం,ఈ చారిత్రాత్మిక రోజు కోసం, భారతదేశానికి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు ప్రసాదించేందుకు ఎందరో అమర వీరులు, స్వాంతంత్ర్య సమర యోధులు తమ ప్రాణాలను పణంగా పెట్టి, సాధించారు అన్నారు.సమరయోధులు చేసిన పోరాటాలు, త్యాగాలను మరువ వద్దని అన్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విశిష్ట సేవలకు గుర్తింపుగా ఉత్తమ సేవా పురస్కారం..

ఆళ్లగడ్డ, ఆగస్టు:15, శ్రీ ప్రస్థానం న్యూస్:- 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయంలో అత్యుత్తమ మరియు ప్రతిభావంతమైన విశిష్ట సేవలు అందించిన ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్ ఏవి.రమేష్ బాబు, మున్సిపాలిటీ రెవిన్యూ ఇన్స్పెక్టర్ శబరీష్, సీనియర్ అసిస్టెంట్ జిలాన్ భాషలకు ప్రతిష్టాత్మ కమైనఉత్తమ పురస్కార అవార్డులు రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి,జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన ఉత్తమ పురస్కార అవార్డులు అందుకున్నారు. ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న మున్సిపల్ కమిషనర్, అర్. ఐ. సీనియర్ అసిస్టెంట్,లకు మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు..



## ప్రారంభమైన అన్నా క్యాంటీన్లు

విజయవాడ, ఆగస్టు 15, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించిన అన్న క్యాంటీన్‌లు ప్రారంభమయ్యాయి. గుడివాడలో అన్న క్యాంటీన్ ప్రారంభించిన సీఎం చంద్రబాబు అక్కడ అందరితో కలిసి భోజనం చేశారు. తొలి విడతగా వంద అన్న క్యాంటీన్లు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనున్నారు. ఇవాళ గుడివాడలో తొలి క్యాంటీన్‌ను సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. మిగతా 99 రేపటి నుంచి అందుబాటులోకి రానున్నాయి. గుడివాడలో జరిగిన ప్రారంభోత్సవానికి చంద్రబాబు



సతీసమేతంగా వచ్చారు. క్యాంటీన్ ప్రారంభమైన తర్వాత అక్కడకు వచ్చిన వారందరికీ దంపతులు ఇద్దరూ వడ్డించారు. అనంతరం వారందరితో కలిసి అక్కడే భోజనం కూడా చేశారు. మిగత క్యాంటీన్లు శుక్రవారం ఉదయం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రారంభించనున్నారు. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా క్యాంటీన్లు ప్రజలకు పూర్తిగా అందుబాటులోకి వస్తాయి. 2014-19 మధ్య కాలంలో అన్న క్యాంటీన్లు ఉండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మూసివేసింది. అధికారంలోకి వచ్చాక తిరిగి అన్న క్యాంటీన్లు పునఃప్రారంభిస్తామని ఎన్నికల్లో ఎన్డీయే కూటమి హామీ ఇచ్చింది. ఈ మేరకు ఇవాళ వాటిని పునః ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 203 క్యాంటీన్లు ప్రారంభించనున్నారు. అన్నింటినీ ఒకేసారి సెప్టెంబర్‌లో పునః ప్రారంభిచాలని అనుకున్నారు. అయితే కొన్ని భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి అయినందుకు ఇప్పుడు వంద వరకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మిగతావి వచ్చే నెలలో ప్రారంభిస్తారు.టిఫిన్ టైంలో ఇడ్లీ చట్నీ లేదా ఏదైనా పొడి, సాంబార్ ఇస్తారు. ఇడ్లీ వద్దనుకుంటే సోమవారం, గురువారం పూరీ, కుర్మా, మంగళవారం, శుక్రవారం ఉప్మా, చట్నీ, బుధవారం, శనివారం పొంగల్, చట్నీ, మిక్చర్ వడ్డిస్తారు. టిఫిన్‌లో మూడు ఇడ్లీ లేదా పూరి, చట్నీ లేదా పొడి 15 గ్రాములు, సాంబార్ 150 గ్రాములు, మిక్చర్ 25 గ్రాములు ఇస్తారు. సోమవారం నుంచి శనివారం వరకు రోజూ మధ్యాహ్నం, రాత్రిపూట ఇక్కడ భోజనం పెడతారు. అన్నంతోపాటు కూర, పప్పు లేదా సాంబారు, పెరుగు, పచ్చడి ఉంటుంది. ఆదివారం మాత్రం క్యాంటీన్లకు సెలవు ఉంటుంది. భోజనం సమయంలో 400 గ్రాముల అన్నం, పప్పు 120 గ్రాములు, కూర 100 గ్రాములు, పచ్చడి 15 గ్రాములు, పెరుగు 75 గ్రాములు అందిస్తారు. ఉదయం 7.30 నిమిషాలకే క్యాంటీన్ తెరుస్తారు. పది గంటల వరకు టిఫిన్ అందిస్తారు. మళ్లీ మధ్యాహ్నం 12.30 నుంచి 3 వరకు భోజనం వడ్డిస్తారు. రాత్రి 7.30 నుంచి 9 గంటల వరకు భోజనం పెడతారు.

## ఏపీలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రాధాన్యం : పవన్‌కల్యాణ్

అమరావతి : ఏపీలో నూతనంగా అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు



అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియంతృత్య పోకడలు, జాతీ సంపదను దోచుకోవడం, ప్రజలను నిర్లక్ష్యం చేసిన పాలకులకు ప్రజలు ఎప్పుడూ బుద్ధి చెబుతారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడానికి ప్రభుత్వం షణ్ముఖ వ్యూహంతో ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 28 రకాల సామాజిక పెన్షన్లు అందిస్తు అండగా నిలుస్తుందని తెలిపారు.పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరుతో అమలు చేస్తుందని అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి మూడంచెల విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయడం, సర్పంచులకు అధికారాలు, సాతంత్ర్య, గణ దినోత్సవా వేడుకల నిర్వహణకు నిధుల పెంచడం లాంటి కార్యక్రమాలు ప్రారంభించామని స్పష్టం చేశారు. దేశ భక్తి పెంపొందించే విధంగా మైనర్ పంచాయతీలకు పది వేలు, మేజర్ పంచాయతీకు రూ. 25 వేలు అందిస్తున్నామని వివరించారు.

## తిరుపాడు గ్రామంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు





పాణ్యం నియోజకవర్గం గడివేముల మండలం తిరుపాడు గ్రామంలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు గ్రామ సర్పంచ్ బాలలింగమ్మ గారి ఆధ్వర్యంలో, స్కూల్ హెడ్ మాస్టర్ గారి అధ్యక్షతన ఘనంగా జరిగింది.ముందుగా చైర్మన్ గారితో జెండా ను ఆవిష్కరణ చేసి తరువాత విద్యార్థుల తి దేశ భక్తి పాటలు పడించారు. ఆటల పోటీలలో పాల్గొని విజేతలైన విద్యార్థులకు సర్పంచ్ ద్వారా బహుమతులు అందించారు. అనంతరం భక్తి గీతాలకు విద్యార్థినులచేత నృత్యులు చేయించారు. చివరిగా జాతీయ గీతం తో కార్యక్రమం ముగించుటం జరిగింది.ఈ కార్యక్రమం లొ సర్పంచ్ గారితో పాటు స్కూల్ చైర్పర్శన్ సుబ్బమ్మ గారు, వైస్ ఛైర్పర్శన్ లక్ష్మిదేవి గారు, గ్రామ నాయకులు పెద్ద వెంకటేశ్వర్లు, శివయ్య, బివిఎన్ రాజు (ఆర్మీ రిటైర్డ్) గ్రామ పెద్దలు మరియు, స్కూల్ స్టాఫ్, అంగన్వాడీ టీచర్ రమణమ్మ గారు, అంగన్వాడీ స్టాఫ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

శుక్రవారం 16-08-2024

## పాలకుల్లో చిత్తశుద్ధి లోపం..ప్రజలకు శాపం !

దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా భారత స్వాతంత్ర్య ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మువన్నెల జెండా రెపరెపలాడింది. ఆకాశాన్ని ముద్దాడుతుందా అన్న రీతిలో త్రివర్ణ పతకాలు ఎగురవేశారు. ప్రజలంతా తమవంతుగా దేశభక్తిని చాటారు. నేతలు కూడా జెండాలు ఆవిష్కరించారు. ఊరూవాడా త్రివర్ణపతాకం ఎగిరింది. ప్రజలు ఉత్సాహంగా ఉత్సవాల్లో పాల్గొని ఐక్యతను చాటారు. మనమంతా ఒక్కటే అని చాటారు. ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోంది... దినదిన ప్రవర్ధమానమవుతోంది... అని ప్రకటించుకోవడం కాదు..ప్రజలు ఏ మేరకు దానిని పొందగలుగుతున్నారన్నదే ముఖ్యం. ఇదే సందర్భంలో మనం మనదేశ పురోగతిపై మననం చేసు కోవాలి. నేతలంతా ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఏటా స్వాతంత్ర్య ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నా..గంభీరమైన ఉపన్యాసాలు ఇస్తున్నా దేశం గురించి నేతలు ఆలోచిస్తున్నారా అన్న అనుమానం కలుగుతోంది. ఎందుకంటే నానాటికి తీసికట్టు నాగంబొట్లు అన్న చందంగా పరిస్థితి తాయరవుతోంది. ఇన్నేళ్లయినా సామాన్యుల బతుకులు బాగుపడడం లేదు. నాయకులు అభివృద్ధి చెందుతున్నారు. అధికారం అనుభవిస్తున్నారు. కానీ ప్రజల బతుకులు మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారయ్యింది. ఈ పరిస్థితి మారాలంటే నాయకుల్లో మార్పు రావాలి. వారి ఆలోచనా ధోరని మారాలి. తామంతా దేశ సేవకోసం అధికారం చేపడు తున్నామన్న ప్రతిజ్ఞ చేసుకోవాలి. ఎందుకంటే నెహ్రూ నుంచి నేటి వరకు మన స్వతంత్ర భారతావనిలో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. ఇప్పటికీ ఎదురవుతూనే ఉన్నాయి. ప్రధానంగా ఉగ్రవాదం, నిరుద్యోగం, మాదకద్రవ్యాల వాడకం పెచ్చుమీరాయి. ఉగ్రవాదులు విదేశీ గడ్డపై నుంచి సవాళ్లు విసురుతున్నారు. దేశ విభజనతో ప్రత్యేక దేశంగా ఏర్పడ్డ పాకిస్తాన్ తన కుత్సిత బుద్ధితే తన దేశంలో ఉగ్రవాద ఫ్యాక్టరీని పెట్టి సవాళ్లు విసరుతోంది. దీంతో ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. సరిహద్దుల రక్షణలో జవాన్లు అమరులవుతున్నారు. ఈ సవాళ్లను అధిగమించేలా ప్రజలను చైతన్యం చేసేలా పాలకులు సంకల్పం తీసుకోవాలి. ప్రధానంగా రాజకీయ అవినీతి ప్రజాస్వామ్యానికి పట్టిన చీడగా గుర్తించాలి. పాలకులు ప్రజాస్వామ్యాన్ని ప్రైవేట్ వ్యాపారంగా చూడరాదు. ప్రస్తుతం ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ కూడా ఒకటిగా ఉందన్న కితాబులతో ఉప్పొంగి పోకుండా క్షేత్రస్థాయి పరిశీలనలతో ప్రజల సమస్యలను పరిష్కరించే సత్తా చూపాల్సిన బాధ్యత పాలకులదే. అప్పుడే మన మనుగడకు అర్థం ఉంటుంది. మన దేశంలో స్టార్టప్ కంపెనీలు మంచి విజయం సాధిస్తున్నా.. యూనికార్న్ కంపెనీల సంఖ్య నానాటికీ పెరుగుతున్నా..ఉపాధి, ఉద్యోగ రంగాల్లో దారుణ పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఇది దేశాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద సమస్యగా చూడాలి. మన ఆర్థిక వ్యవస్థ బలపడడానికి స్టార్టప్ కంపెనీలు దోహద పడుతున్నాయని చెప్పుకుంటున్నా..ఉద్యోగ కల్పన మాత్రం కానరావడం లేదు. మనం సాధిస్తున్న అభివృద్ధి ఖచ్చింతంగా పేదలకు చేరాలి. అప్పుడే మనం అభివృద్ధి సాధించినట్లు చెప్పుకోవాలి. దీర్ఘకాలంలో ఉపయోగపడేలా ఆర్థిక సంస్కరణలు చేపట్టాలి. విధాన నిర్ణయాలు అమలు చేయాలి. ఆర్థిక విజయం ప్రజల జీవితాలను సులభతరం చేసేలా ఉండాలి. దేశాన్ని,రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే నేతల్లో చిత్తశుద్ధి కావాలి. నాయకుల్లో పరివర్తన రావాలి. గంభీరమైన ఉపన్యాసాలు కాకుండా చిత్తశుద్ధితో పనిచేసే సంకల్పం కావాలి. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చగలిగేలా పనిచేస్తామన్న సంకల్పం రావాలి. ఇడి కేసులంటే వేధింపులుగా చూపుతూ తమ డొల్లతనాన్ని చాటుకుంటున్నారు. విచారణలను రాజకీయ కక్షలుగా చూపుతున్నారు. నీతులు వల్లించే నేతలంతా అవినీతికి కొమ్ముకాస్తున్నారు. ఆకలి, దరిద్రం, మందుల కొరత, ఆహార ధాన్యాల ధరలు, ప్రజలను పట్టిపీడిస్తున్నా..పట్టించుకోకుండా ధనార్జనే ధ్యేయంగా రాజకీయాలు నడుపుతున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలోని అసలైన శక్తిసామర్థ్యాలను గుర్తించడంలో ప్రపంచానికి భారత్ తోడ్పాటును అందించి సత్తా చాటుతున్న వేళ దేశంలో ఉన్న సమస్యలను గుర్తించాలి. అణగారిన వర్గాలు, పేదలు, అవసరాల్లో ఉన్నవారి పట్ల దయార్ధ్ర హృదయంతో ముందుకు సాగాల్సి ఉంది. ఈ దేశ సంపద ఏ కొందరిదో కాకుండా..అందరిదీ అన్న సంకల్పం చాటాలి. ఆర్థిక సంస్కరణలతోపాటు వినూత్న ప్రజా సంక్షేమ పథకాలతో దేశం ముందడుగు వేస్తోందని చెప్పుకుంటున్న పాలకుల అవి ఏ మేరకు ప్రజలకు మేలు చేస్తున్నాయో విశ్లేషంచుకోవాల్సి ఉంది. సమున్నతంగా ఎదుగుతున్న నూతన భారత్‌ను ప్రపంచం కీర్తిస్తోంది. దీనిని కాదనలేం. కానీ ఇదే సందర్భంలో దేశాన్ని పట్టి పీడుస్తున్న అనేకానేక సమస్యలపై పోరాటంలో పాలకుల్లో చిత్తశుద్ధి లోపించింది. పేదరికం, నిరక్షరాస్యత తాండవిస్తున్నది. దేశ భద్రత, ప్రగతి,అయితే ప్రాంతీయ అసమానతలను తగ్గించడంతోపాటు సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పాలకులు తీసుకుంటున్న చర్యలు అంతగా ప్రతిఫలించడం లేదు. పెరిగిన ధరలు సామాన్యులను, మధ్యతరగతి ప్రజలను సొంతింటి కలకు దూరం చేస్తోంది.మనం స్వేచ్ఛగా జీవించేందుకు ఎంతోమంది మహనీయులు ఎన్నో త్యాగాలు చేశారు. వారిని స్మరించుకోవాల్సిన సందర్భం ఇది. వారి త్యాగాలను కేవలం కొందరే అనుభవిం చడం అభివృద్ధి కాదు. ముఖ్యంగా మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నా..వారికి రక్షణ లేకుండా పోయింది. నిర్భయంగా వారు బజారులో తిరిగే పరిస్థితి లేదు. ఈ సమస్యలను ఆకళింపు చేసుకుని విధానాలు రూపొందించి చిత్తశుద్ధితో అమలు చేస్తూ పోతేనే మనం సమగ్రాభివృద్ధి సాధించగలం. మన భారత ప్రజాస్వామ్యం పరిఢవిల్లగలదు.

# అగ్రిగోల్డ్ కేసు...నీళ్లు నమిలిన పోలీసులు

విజయవాడ, ఆగస్టు 15 అగ్రిగోల్డ్ కేసులో ఏపీ పోలీసుల దర్యాప్తు తీరుకు అద్దం పట్టే ఘటన విజయవాడ ఏసీబీ కోర్టులో జరిగింది. డిపాజిటర్ల నుంచి వేల కోట్ల రుపాయలు సేకరించి ముంచేసిన అగ్రిగోల్డ్ వ్యవహారంపై పదేళ్లుగా ఏపీ సీఐడి దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో నిందితులకు రిమాండ్ పూర్తి చేసుకుని బెయిల్‌పై బయటకు కూడా వచ్చేశారు.పదేళ్ల క్రితం మొదలైన కేసు దర్యాప్తు ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. తాజాగా సీఐడీ అటాచ్ చేసిన భూముల్ని అక్రమంగా రిజిస్టర్ చేసుకున్న వ్యవహారంలో మాజీ మంత్రి జోగి రమేష్ తనయుడు రాజీవ్ మండల సర్వేయర్ రమేష్‌లను ఏసీబీ అరెస్ట్ చేసింది. విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో 2వేల గజాల స్థలాన్ని అక్రమంగా రిజిస్టర్ చేసి స్వాధీనంలోకి తీసుకున్న వైనాన్ని ఆధారాలతో బయటపె ట్టడంతో దుమారం రేగింది.ఈ వ్యవహారంలో విజయవాడ టూటౌన్ పోలీసులు నిర్లక్ష్యం, ఏపీ సీఐడీ నిర్లిప్త వైఖరి, రాజకీయ నాయకులకు కొమ్ముకాసిన రెవిన్యూ,సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల వైఖరిని బయటపెట్టడంతో ఏపీ ప్రభుత్వం స్పందించింది. ఆ తర్వాత ఈ వ్యవహారంపై పెద్ద ఎత్తున దుమారం రేగడంతో రాష్ట్ర ప్రభుత్వం సిఐడి విచారణకు ఆదేశించింది. అదే సమయంలో అగ్రిగోల్డ్ డైరెక్టర్లు తమ భూమిని కబ్జా చేసినా పట్టించుకోవడం లేదని ఏపీ హైకోర్టును ఆశ్రయించడంతో సిఐడి అధికారులు మేల్కొన్నారు. సీఐడీ, ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూములకు అగ్రిగోల్డ్ యజమా నులు తమదిగా క్లెయిమ్ చేయడంతో అప్రమత్తం అయ్యారు. అగ్రిగోల్డ్ ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తే సాంకేతిక ఎదురయ్యే చిక్కుల్ని ఆలస్యంగా గుర్తించారు. ఈ మొత్తం వ్యవహారంలో అగ్రిగోల్డ్ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్న పోలీస్ అధికారుల పాత్రపై కూడా అనుమానాలు ఉన్నాయి. భూముల కబ్జా వెనుక వారి సహకారం ఉండొచ్చనే సందేహాలు ఉన్నాయి. పోలీసులు కేసులు నమోదు చేయకుండా తాత్సారం చేయడానికి ఇదే అసలు కారణంగా తెలుస్తోంది.ఏపీలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో మొత్తం వ్యవహారం తారుమారైంది. ఎన్నికలకు ముందే గత జనవరి నాటికి అంబాపురం గ్రామంలో ఉన్న భూమిని జోగి రమేష్ కుటుంబం తమ స్వాధీనంలోకి తెచ్చుకుంది. సర్వే నంబర్ 87లో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్ని సర్వే నంబర్ 88లో జోగి కుటుంబం కొనుగోలు చేసిన భూమిగా పేర్కొంటూ ఫెన్సింగ్ వేశారు. ఇదంతా పథకం ప్రకారం చేశారు. ఆ తర్వాత విజయవాడ వైసీపీ కార్పొరేటర్ పగిడిపాటి చైతన్య రెడ్డి కుటుంబానికి చెందిన ఏడుగురికి విక్రయించినట్లు మరో రిజిస్ట్రేషన్ చేశారు. భూమి చేతులు మారినట్టు చూపించడానికే ఇలా చేశారు.ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వస్తే ఆ భూమిలో భారీ అపార్ట్‌మెంట్ నిర్మించాలని ప్రణాళిక రచించారు. విజయవాడ నగర శివార్లలో ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి ఉన్న భూమి కావడంతో వెంటనే ఫ్లాట్లను విక్రయించేసి సొమ్ము చేసుకోవాలని ప్లాన్ చేశారు. ఇందుకు గ్రామ సర్వేయర్ నుంచి ఎమ్మార్వో వరకు అందరిని మేనేజ్ చేశారు.2014లో అగ్రిగోల్డ్ కుంభకోణం వెలుగు చూసిన తర్వాత 2015 నుంచి పలు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఏపీతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించిన సిఐడి అధికారులు వేల ఎకరాల భూములు, వాటికి సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. 2017లోనే వాటిని సిఐడి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి ఏపీ హోంశాఖ జీవో నంబర్ 133, జీవో నంబర్ 117 జారీచేసింది.అంబాపురం భూముల వ్యవహారంలో జోగి రాజీవ్‌ను అరెస్ట్ చేసిన తర్వాత సాయంత్రం ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. ఈ క్రమంలో అగ్రిగోల్డ్ భూముల అటాచ్‌మెంట్‌కు సంబంధించి కోర్టు ఉత్తర్వులు చూపాలని ఏసీబీ కోర్టు న్యాయమూర్తి హిమబిందు పోలీసుల్ని ప్రశ్నించారు. దీంతో ఏసీబీ సిఐ శివప్రసాద్ కోర్టులో తెల్లముఖం వేశారు. కోర్ట్ అటాచ్‌మెంట్ ఆర్డర్లు లేకుండా సిఐడి అటాచ్‌మెంట్ ఎలా జరుగుతుందనే ప్రశ్న తలెత్తడంతో దర్యాప్తు బృందం బిక్క ముఖం వేసింది. విచారణాధికారి సమాధానం చెప్పలేక మౌనంగా నిలబడ్డారు. కోర్టు హాల్లో ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ కూడా తడబడ్డారు.అగ్రిగోల్డ్ కేసులు దర్యాప్తు చేస్తున్న అధికారులు కూడా ఏమి జరిగిందనే దానిపై వివరణ ఇవ్వలేకపోయారు. చివరకు కోర్టు హాల్లో ఉన్న న్యాయవాదులు పోలీసులకు అసలు విషయం చెప్పారు. ఏపీ డిపాజిటర్స్ ప్రొటెక్షన్ యాక్ట్ సెక్షన్ 3,4 ఆధారంగా ఏపీ హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని, వాటిని గతంలోనే కోర్టు ధృవీకరించిందని చెప్పడంతో ఏసీబీ అధికారులు నాలుక కరుచుకున్నారు. అప్పటికప్పుడు ఏపీ డిపాజిటర్స్ యాక్ట్ పుస్తకాలను కోర్టులో సమర్పించారు. జీవో 117, 133లను జారీ చేసిన నేపథ్యం వివరించారు. మాజీ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్‌ను కోర్టులో ప్రవేశ పెట్టే సమయంలో ఆసక్తికరమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 7 ప్రకారం అభియోగాలను నమోదు చేశారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ఈ సెక్షన్లను వర్తింప చేశారు.కోర్టు విచారణ సందర్భంగా మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి జోగి తరపున ఏసీబీ కోర్టులో వాదనలు వినిపించారు. వైసీపీ లీగల్ టీమ్ జోగి తరపున న్యాయ సహాయం అందించేందుకు కోర్టుకు వచ్చారు. గత ఏడాది సెప్టెంబర్‌లో పీసీ యాక్ట్ సెక్షన్ 7 ప్రకారం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు రిమాండ్ విధించాలని ఏపీ ప్రభుత్వం తరపున వాదనలు వినిపించారు. అగ్రిగోల్డ్ భూముల కేసులో రాజీవ్‌కు ఆ సెక్షన్లు వర్తించవని నిందితుడి తరపు న్యాయవాదులు పేర్కొన్నారు.కేసు తీవ్రతను పరిగణలోకి తీసుకున్న న్యాయ స్థానం రాజీవ్‌తో పాటు మండల సర్వేయర్ రమేష్‌కు ఈ నెల 23వరకు రిమాండ్ విధించారు. ఈ కేసులో మిగిలిన నిందితుల్ని కూడా అరెస్ట్ చేయనున్నారు. నిందితులపై పీసీ యాక్ట్ 7,12తో పాటు ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేశారు.

# ప్రకాశంలో వైసీపీకి షాక్..!



ఒంగోలు, ఆగస్టు 15 ,వైసీపీకి గడ్డుకాలం నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత... ఒక్కొక్కరిగా నేతలు పార్టీని వీడుతున్నారు. తాజాగా ప్రకాశం జిల్లాలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. ఒంగోలు మేయర్ సుజాతతో పాటు 12 మంది కార్పొరేటర్లు వైసీపీ రాజీనామా చేశారు. నాయుడుపాలెంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే దామచర్ల వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఒంగోలు మేయర్ స్థానాన్ని వైసీపీ కైవసం చేసుకుంది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూటమి అనూహ్యంగా విజయం సాధించింది. దీంతో మున్సిపాలిటీల్లో వైసీపీ పట్టు సడలిపోతుంది. ఒక్కొక్కరిగా పార్టీ మారుతున్నారు. ఇప్పటికే చిత్తూరు, విశాఖలో కార్పొరేటర్లు టీడీపీ, జనసేనలోకి జంప్ అయ్యారు. తాజాగా ఒంగోలులో మేయర్ తో పాటు 12 మంది కార్పొరేటర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఒంగోలు అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ సీనియర్ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి ఓడిపోయారు. బాలినేని శ్రీనివాసరెడ్డిపై టీడీపీ నుంచి పోటీచేసిన దామచర్ల జనార్దన్ ఘన విజయం సాధించారు. దీంతో ఒంగోలు కార్పొరేషన్ లో చక్రం తిప్పిన ఆయన...వైసీపీ నేతలను, కార్పొరేటర్లను టీడీపీ వైపు ఆకర్షించారు. తాజాగా చేరికలతో ఒంగోలు మేయర్ పీఠం టీడీపీ కైవసం అయ్యింది.రాష్ట్రంలో అధికారం కోల్పోయిన వైసీపీ స్థానిక సంస్థలపై పట్టుకోల్పోతుంది. పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో వైసీపీ ప్రతినిధులు ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. ఇక పంచాయతీలలో కూడా వైసీపీ బలహీనపడుతుంది. ఎన్నికలకు ముందు ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరగా...తాజాగా 12 మంది కార్పొరేటర్లు మేయర్ టీడీపీ గూటికి చేరారు. ఒంగోలులో ఒకప్పుడు మాజీ మంత్రి బాలినేని చెప్పిందే చెల్లేది. కానీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అంతా తారుమారు చేసింది. ఓటమి తరువాత బాలినేని నియోజకవర్గం వైపు చూడకపోవడం, పార్టీ కేడర్ ను పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో వైసీపీ నేతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ నేపథ్యంలోనే పెద్ద సంఖ్యలో వైసీపీ కార్పొరేటర్లు రాజీనామా చేసి టీడీపీలో చేరారు.అధికారం కోల్పోయిన తర్వాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి వరుస షాక్ లు తగులుతున్నాయి. ఇటీవల మాజీ మంత్రి ఆళ్ల నాని వైసీపీకి రాజీనామా చేశారు. ఏలూరు జిల్లా అధ్యక్ష పదవితో పాటు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వ్యక్తిగత కారణాలతో రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు నాని తన లేఖలో వెల్లడించారు. తన రాజీనామా లేఖను పార్టీ అధినేత జగన్‌కు పంపించారు. గత ప్రభుత్వంలో నాని డిప్యూటీ సీఎం పదవితో పాటు వైద్యారోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు.ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆళ్ల నాని 2004లో గెలిచారు. ఆ తర్వాత 2009 ఎన్నికల్లోనూ విజయం సాధించారు. ఆ తర్వాత కాంగ్రెస్ ను వీడి... జగన్ తో నడిచారు. 2014 ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి వైసీపీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన కోటా రామారావు విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో ఆళ్ల నాని గెలిచారు. రాష్ట్రంలో వైసీపీ కూడా అధికారంలోకి రావటంతో ఆయన్ను మంత్రి పదవి వరించింది. వైద్యారోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇదే సమయంలో ఆయన్ను డిప్యూటీ సీఎంగా నియమించారు. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏలూరు నుంచే పోటీ చేసిన నాని... ఓటమిపాలయ్యారు. టీడీపీ తరపున పోటీ చేసిన రాధాకృష్ణయ్య విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో 62 వేల ఓట్ల తేడాతో ఆళ్ల నాని ఓడిపోయారు.

## మచిలీపట్టణం, రేపల్లె రైల్వే లైన్ క్లియర్

గుంటూరు, ఆగస్టు 15 బందరు ప్రజల దశాబ్దాల కోరిక అయినటువంటి మచిలీపట్నం – రేపల్లె మధ్య 45 కిలోమీటర్ల రైల్వే లైన్‌ను పూర్తి చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విన్నవించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రిని కలిసి రైల్వే లైన్ ఏర్పాటు గురించి వినతిపత్రం అందించారు.గత ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసిందని, ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. అందులోనూ దశాబ్దాల ఈ ప్రాంత వాసుల కోరికైన రైల్వే లైను కోసం అధిక శ్రద్ధ పెట్టారు. మచిలీపట్నం దశాబ్దాల క్రితమే అంతర్జాతీయ వాణిజ్య వ్యాపార రంగాల్లో కీలకంగా వ్యవహరించింది.ఈ మార్గం పూర్తైతే.. చెన్నై – కలకత్తా మార్గంలో చాలా వరకు ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని, దూరం కూడా 100 కిలోమీటర్లకు పైగా తగ్గుతుందన్నారు. ప్రత్యేకంగా సరుకు రవాణా రైళ్లను విజయవాడ వైపు కాకుండా మచిలీపట్నం వైపుగా మళ్లించడం ద్వారా విజయవాడ రైల్వే స్టేషన్ రద్దీ కూడా తగ్గించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తైతే పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ఒంగోలు జిల్లాల పరిధిలోని ప్రజలకు ప్రయాణం సులువుగా మారుతుంది.మచిలీపట్నంలో పోర్టు నిర్మాణ పనుల్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ రైలు మార్గం అందుబాటులోకి వస్తే ఎగుమతుల ద్వారా ఆదాయం కూడా ఆశించిన మేర లభిస్తుంది. ప్రత్యేకంగా మత్స్య ఎగుమతులు ఎక్కువగా జరిగే అవకాశాలున్నాయి.మరోవైపు.. అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దబడుతున్న అమరావతి కూడా సమీపంలోనే ఉండడం వలన అంతర్జాతీయ ఎగుమతులు, దిగుమతులు ఎక్కువగా జరగనున్నాయి. ఇటు తెలంగాణ రాష్ట్రానికి సమీపంలో ఉండే పోర్టు కావడంతో ఈ రైల్వే లైనుకు ప్రాధాన్యం సంతరిస్తుంది. టూరిజం కూడా పెరిగే అవకాశాలున్నాయి. మచిలీపట్నం – రేపల్లె రైల్వే లైన్ ఏర్పాటు ద్వారా ఉన్న ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.మచిలీపట్నం – రేపల్లె రైల్వే లైన్ ఏర్పాటుకు ఉన్న ప్రాముఖ్యత అర్థమైందని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తానని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ హామీ ఇచ్చినట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. తీర ప్రాంతంలో రైల్వే లైన్ ఏర్పాటు ద్వారా ఉన్న ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు.తొలి దశలో మచిలీపట్నం – రేపల్లె లైన్ పూర్తి చేసి, మలి దశలో నర్సాపురంకు అనుసంధానించే ప్రణాళిక కూడా ఉందని కేంద్ర మంత్రి చెప్పారన్నారు. ఈ మార్గం పూర్తి చేయడం ద్వారా తీర ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి ఎక్కువగా అవకాశం ఉంటుందని కేంద్ర మంత్రికి వివరించినట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

# ఢిల్లీకి చంద్రబాబు

విజయవాడ, ఆగస్టు 15, (న్యూస్ పల్స్)ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరోసారి ఢిల్లీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగోసారి ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలోనే రాష్ట్రానికి రావాల్సిన నిధులు కోసం ఇప్పటికే పలుమార్లు ఆయన ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం ఆయన మరోసారి ఢిల్లీకి వెళ్ళనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఉండవల్లి నుంచి బయలుదేరి ప్రత్యేక విమానంలో ఢిల్లీ చేరుకుంటారు.శనివారం ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో చంద్రబాబు నాయుడు భేటీ కానున్నారు. అదేరోజు రాత్రి కేంద్ర ఆర్థిక, జలవనురులశాఖ మంత్రితోపాటు మరికొంత మంది కేంద్రమంత్రులతోనూ సమావేశం కానన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్చించనున్నారు. ప్రధానంగా అమరావతి నిర్మాణానికి నిధులు, పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన గతంలో ఇచ్చిన ప్రతిపాదనలను ఆమోదించడంతోపాటు నిధులు కేటాయింపు అంశాన్ని మరోసారి కేంద్ర ఆర్థిక, జల వనరులశాఖ మంత్రితో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించే అవకాశాలు ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వీటితోపాటు రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేకంగా కేటాయించనున్న నిధులు, ఇటీవల జాతీయ రహదారుల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు తదితర కీలకమైన అంశాలను కూడా ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రులతో భేటీ సందర్భంగా ప్రస్తావించే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న కొన్ని పథకాలకు సంబంధించి రావాల్సిన నిధులు విషయాన్ని మంత్రుల దృష్టికి చంద్రబాబు నాయుడు తీసుకెళ్లనున్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన నేపథ్యంలో శుక్రవారం, శనివారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో జరిగే ముఖ్యమంత్రి కార్యక్రమాలను కూడా రద్దు చేసినట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో దాడులు పెరుగుతున్నాయి అంటూ జగన్మోహన్ రెడ్డి పదేపదే ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీ వేదికగా ఆయన ఆందోళన కూడా చేశారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో భేటీ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలపై చర్చ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు విషయాన్ని స్వయంగా చంద్రబాబునాయుడు వాస్తవాలను తెలియజేసే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాజకీయంగా మనుగడను తెలియజేసేందుకే ఈ తరహా ఆరోపణలు ఆయన చేస్తున్నట్లు వెల్లడించే అవకాశం ఉంది. అదే సమయంలో మరికొన్ని అంశాలపైన ఇరువురి మధ్య కీలక చర్చలు జరగనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన నేపథ్యంలో ఎంపీలు అందుబాటులో ఉండాలని ఇప్పటికే పార్టీ నుంచి సమాచారం అందింది. ఢిల్లీ పర్యటన ఆద్యంతం చంద్రబాబు నాయుడు వెంట కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తోపాటు కూటమి పార్టీకి చెందిన మిగిలిన 19 మంది ఎంపీలు అందుబాటులో ఉండాల్సిందిగా సమాచారం ఎంపీలకు వెళ్ళింది. ఈ పర్యటనలో భాగంగా శుక్రవారం రాత్రి గాని శనివారం ఉదయం గాని ఎంపీలు తోను ఆయన సమావేశం అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఎంపీలకు వివిధ శాఖలకు సంబంధించిన బాధ్యతలను చంద్రబాబు నాయుడు అప్పగించారు. ఆయా శాఖల నుంచి రాష్ట్రానికి రావలసిన నిధులకు సంబంధించి కేంద్ర మంత్రులతో కలిసి వెళ్లాల్సిందిగా ఆదేశించారు. వీటికి సంబంధించిన పురోగతిని ఎంపీలు సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలుసుకునే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రానికి వీలైనంత ఎక్కువగా నిధులు రాబట్టేందుకు కేంద్ర మంత్రులతోపాటు ఎంపీలు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేయాలని ఈ సందర్భంగా ఆయన ఎంపీలకు సూచించే అవకాశం ఉంది.

## భార్గవ్ స్థానంలో...అశోక్..

తిరుపతి, ఆగస్టు15, వైసీపీ అధినేత జగన్ పార్టీలో కీలకమైన విభాగాల్లో మార్పులకు శ్రీకారం చుట్టారా? పార్టీతోపాటు అన్ని విభాగాలను ప్రక్షాళన చేస్తున్నారా? ఎన్నికల తర్వాత సజ్జలను ఎందుకు దూరంగా పెట్టారు? ఆయన ఆలోచనలు బూమరాంగ్ అయ్యాయా? ఇప్పుడు జూనియర్ సజ్జలను సైడున పెట్టారా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.వైసీపీ పాలనలో తోడుగా నిలిచినవారిని జగన్ దూరం పెడుతున్నట్లు తెలుస్తోంది. అన్నింటి కంటే ముందు తొలుత సజ్జల సేవలకు ముగింపు పలికారు. ఎన్నికల తర్వాత ఆయన పెద్దగా మీడియా ముందుకు రాలేదు. గతంలో మంత్రులుగా వ్యవహరించినవారు మాత్రమే మీడియా ముందుకు వచ్చి చెప్పాల్సిన నాలుగు మాటలు చెబుతున్నారు. దీంతో సజ్జలను దూరంగా పెట్టారనే వాదనలు లేకపోలేదు.ఇప్పుడు జూనియర్ సజ్జల వంతైంది. ఆయన సేవలకు ముగింపు పలకాలని జగన్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల తర్వాత సజ్జల భార్గవ్ దాదాపుగా కనుమరుగయ్యారు. దీంతో వైసీపీ సోషల్‌మీడియా వింగ్‌కు కొత్త బాస్‌ను ఎంపిక చేశారట. ఎన్నారై అశోక్‌రెడ్డికి ఆ బాధ్యతలు అప్పగించినట్టు తెలుస్తోంది. జగన్‌కి ఆయన సమీప బంధువు కూడా.ఇంతకీ అశోక్‌రెడ్డి ఎవరు? ఎక్కడ.. ఎవరికి దగ్గర ఇలా రకరకాల ప్రశ్నలు రైజ్ అవుతున్నాయి. అశోక్‌రెడ్డి ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నారు. పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి సోషల్‌మీడియా వ్యవహారాలు చూస్తున్నారట. అంతేకాదు ఆయన విజయమ్మకు దగ్గర బంధువు కూడా. ఆయన నియమాకంపై అధికారిక ప్రకటన రావాల్సివుంది. రానున్న ఐదేళ్లు వైసీపీకి కీలకం. అందులో ప్రస్తుతం అధికారంలో ఉన్న చంద్రబాబు సర్కార్‌ను ఎదుర్కోవడం ఆషామాషీ కాదు.మరోవైపు వైసీపీలో కీలక మార్పులు ఉండనున్నట్లు వైసీపీ నుంచి సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ విషయాన్ని పసిగట్టిన కొందరు నేతలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. మరికొందరు బయటకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు అంతర్గత సమాచారం. పార్టీలో ఎలాంటి ఆరోపణలు లేని నేతలకు జిల్లా పగ్గాలను అప్ప గించాలన్నది అధినేత ఆలోచనగా చెబుతున్నారు.

# టీటీడీ ఇంజనీరింగ్ లో 55 మందికి షోకాజ్

తిరుమల, ఆగస్టు 15 టీటీడీలో ఇంజినీరింగ్ విభాగంలో కలకలం రేగుతోంది. గతంలో జరిగిన తప్పిదాలకు సమాధానం చెప్పాలని నోటీసులు పంపించడంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని కానీ ఉన్నతాధికారులు చెప్పినట్టు చేసిన తమను ఎందుకు టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. టీటీడీలో గత ప్రభుత్వ హయాంలో ఛైర్మన్లుగా పని చేసిన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి శ్రీవాణి ట్రస్ట్‌ను పూర్తి స్థాయిలో నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం, పాడు బడిన పురాతన ఆలయాల పునర్నిర్మాణం, శిధిలావస్థలో ఉన్న పాత ఆలయాల నిర్మాణం చేయడం శ్రీ వేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్ట్ ( శ్రీవాణి) ముఖ్య ఉద్దేశం. ఈ ట్రస్ట్‌కు భక్తులు ఎవరైనా రూ. 10వేలు అంతకంటే ఎక్కువ చెల్లించవచ్చు. ఇలా చెల్లించిన వారికి స్వామి వారి బ్రేక్ దర్శనం రూ. 500 తో చేసుకునే అవకాశం కల్పించారు.స్వామి వారి బ్రేక్ దర్శనం కోసం పరితపించే భక్తులు ఈ ట్రస్ట్ ద్వారా రూ. 10 చెల్లించి అదనంగా టికెట్ కొనుగోలు చేయడం సులభతరం కావడంతో ఎక్కువ మంది మొగ్గు చూపారు. ఈ ట్రస్ట్ ద్వారా రూ. 100కోట్లపైన టీటీడీకి విరాళాలు అందాయి. ఈ ట్రస్ట్ కార్యకలాపాలు అన్ని అవినీతి అక్రమాలు జరిగాయని కూటమి ప్రభుత్వం అప్పట్లో ఆరోపించింది. నిధులు దారి మళ్లించారు, అవసరం లేని ప్రాంతాల్లో ఆలయ నిర్మాణాలు చేసి అధిక మొత్తంలో డబ్బు వసూలు చేశారు, అనుకూలురకు కాంట్రాక్టర్లుకు అధిక శాతం పనులు అప్పగించి కమీషన్లు తీసుకున్నట్లు ఆరోపించారు. ఇంజినీరింగ్ విభాగంలో రివర్స్ టెండర్లు పిలిచి 1500 కోట్ల పనులు చేశారని కూడా విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తిరుమల నుంచే ప్రక్షాళన చేస్తానని అన్నారు. అక్కడితో అంతా ఏమి జరుగుతుందో అని ఎదురు చూడగా మరుసటి రోజు టీటీడీ ఈవో నియామకం... అప్పటి వరకు అదనపు ఈవోగా ఉన్న ధర్మారెడ్డిని బదిలీ చేశారు. శ్రీవాణి ట్రస్ట్‌ను పక్కన పెట్టి ఇంజినీరింగ్ విభాగం పై దృష్టి పెట్టారు.అంతే కాకుండా టీటీడీలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. కూటమి ప్రభుత్వం గత పాలకులు చేసిన తప్పిదాలను బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో ఇంజినీరింగ్ విభాగం లోని 55 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇది విమర్శల పాలైంది. అసలు చేసింది పాలకులు.. అప్పటి టీటీడీ బోర్డు అయితే తామేం చేశామని నోటీసులు ఇచ్చారని అంటున్నారు ఉద్యోగులు.ప్రభుత్వం నియమించిన టీటీడీ బోర్డు నిర్ణయం మేరకు.. ఉన్నతాధికారుల ఆదేశాలతో సర్వీస్ రూల్స్ ప్రకారం విధులు చేపట్టామంటున్నారు ఉద్యోగులు. ఏదైనా తప్పు జరిగిందా... తాము ఏమైన తప్పు చేశామా అంటూ ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధులను సైతం కలిసారు. వారి నుంచి సానుకూల స్పందన వచ్చినా సంతృప్తికరంగా నిర్ణయం రాలేదని అంటున్నారు. నోటీసులపై ఆగ్రహంగా ఉన్న ఉద్యోగులు ఇంజినీరింగ్ యూనియన్ సమావేశం నిర్వహిస్తున్నారు. భవిష్యత్ కార్యచరణపై నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉంది. అవసరమైతే టీటీడీ, రాష్ట్ర విజిలెన్స్‌పై పోరాటానికి కూడా సిద్ధమవుతామని అంటున్నారు. తప్పు చేసిన వారిని పట్టుకుని శిక్షించాలని సంబంధం లేని తమకు నోటీసులు ఏంటని ప్రశ్నిస్తున్నారు

# అనిల్ ..మాయం..

నెల్లూరు, ఆగస్టు 15, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ పార్టీ అధికారాన్ని కోల్పోయిన తర్వాత ఎవరికీ దొరకడం లేదు. అస్సలు కనపడటం లేదు. పార్టీ కార్యక్రమాలను కూడా పట్టించుకోవడం లేదు. అనిల్ కుమార్ యాదవ్‌ను రాజకీయాల్లో ఒక పడిలేచిన కెరటంగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చిన అనిల్ కుమార్ యాదవ్ ఎమ్మెల్యే అయ్యారు. ఒకటి కాదు రెండు సార్లు ఎమ్మెల్యేగా నెల్లూరు పట్టణ ప్రజలు గెలిపించుకున్నారు. ఇక వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏకంగా నీటిపారుదల శాఖ మంత్రి అయుయారు. నెల్లూరు జిల్లాలో తనకు తిరుగులేదని భావించిన అనిల్ కుమార్ యాదవ్ ఒక ఊపు ఊపారు. అనిల్ కుమార్ యాదవ్ వైఎస్ జగన్ కు వీరాభిమాని. ఆయన మాటల్లో, చేతల్లో ఎప్పుడూ పంచ్ ల మీద పంచ్ లు ఉండేవి. 2014 ఎన్నికల్లోనూ, 2019 ఎన్నికల్లోనూ అనిల్ కుమార్ యాదవ్ స్పీడ్ చూసిన వారు ఎవరైనా ఆయనకు ఫిదా కావాల్సిందే. ప్రత్యర్థులను విమర్శించడంలో దిట్టగా పేరొందారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ మీద, అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వం మీద నిప్పులు చెలరేగే వారు. అనిల్ అన్నగా అందరికీ సుపరిచితమైన ఆయన వైసీపీ లో ఫైర్ బ్రాండ్ లీడర్ గా గుర్తింపు పొందారు. అయితే అదే సమయంలో తన మొండి వైఖరి అనుకోండి... కలుపుకోలేని మనస్తత్వం అనుకోండి నెల్లూరు జిల్లాలో కీలక నేతలకు దూరమయ్యారు. సొంత పార్టీ నేతలకే మింగుడు పడని అనిల్ కుమార్ యాదవ్ ను దెబ్బతీసేందుకు కాచుక్కూర్చుని ఉండేలా శత్రువర్గాన్ని బాగానే తయారు చేసుకున్నారు. అదే ఆయనకు 2024 ఎన్నికల్లో రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది. చివరకు నెల్లూరు పట్టణ వైసీపీ టిక్కెట్ ను ఆయన దూరం చేసుకోవాల్సి వచ్చింది. ఆయనకు చివరకు నెల్లూరు టిక్కెట్ లేకుండా పోయింది. ఆయనను నెల్లూరు నుంచి వైఎస్ జగన్ పల్నాడు జిల్లాకు బదిలీ చేయాల్సి వచ్చింది. 2024 ఎన్నికల్లో నరసరావుపేట పార్లమెంటు టిక్కెట్ ఇచ్చారు. ఇక ఇష్టం లేకపోయినా తలూపి.. వేరే దారిలేక అనిల్ కుమార్ యాదవ్ పోటీకి దిగారు. నరసారావుపేటలో కూడా అదే దూకుడు ప్రదర్శించారు. తీరా పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత ఆయన అడ్రస్ లేకుండా పోయింది. పల్నాడు జిల్లాలో జరుగుతున్న ఘర్షణలు, హత్యలపై కూడా ఆయన స్పందన కరువైంది. ఇక నెల్లూరు జిల్లాలో కూడా అనిల్ కుమార్ యాదవ్ పూర్తిగా పట్టుకోవాల్సి వచ్చింది. అయితే ఆయన కొన్నాళ్ళు రాజకీయాలకు విరామం ప్రకటించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఎక్కువగా చెన్నైలోనే ఉంటున్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. మళ్లీ నెల్లూరు జిల్లా నుంచే రాజకీయాలు చేయాలని ఆయన భావిస్తున్నట్లు తెలియవచ్చింది. కొంత గ్యాప్ ఇచ్చిన తిరిగి నెల్లూరు పట్టణ నియోజకవర్గంలో మళ్లీ రాజకీయం మొదలుపెట్టాలని ఆలోచిస్తున్నట్లు తెలిసింది. అనిల్ ఎక్కడ అంటూ వైసీపీ కార్యకర్తలే అడుగుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



# పీకల్లోతు కష్టాల్లో ద్వారంపూడి...



కాకినాడ, ఆగస్టు 15, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి.. ఈ పేరు చెబితే ఠక్కున కాకినాడ పేరు గుర్తుకు వస్తుంది. ఓ రకంగా ఆ నగరాన్ని ఆయన అడ్డాగా మార్చుకున్నారు. వైసీపీలో కీలక నేతగా వ్యవహరిస్తూ.. పలు వ్యాపారాలు చేశారు. అయితే.. ద్వారంపూడి చేసిన వ్యాపారాలు ఇల్లీగల్ అనే వార్తలు గుప్పుమనటమే కాదు.. చాలా చోట్లా కేసులు కూడా నమోదు అయ్యాయి. నాడు ప్రభుత్వం అండతో తప్పించుకున్న ద్వారంపూడికి.. ప్రస్తుతం అన్ని ద్వారాలు మూసిపోయే పరిస్థితి నెలకొంది. వరుసగా కేసులు నమోదు, వివాదాలు, ఆరోపణలు నేపథ్యంలో సదరు నేత ఉక్కిరిబిక్కిరి అవుతున్నారంటూ ప్రచారం సాగుతోంది.ఇటీవల కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై కేసు నమోదైంది. ?మున్సిపల్ అధికారుల విధులను ఆయన అడ్డుకున్నారని కాకినాడ రెండో పట్టణ ఖూలో కేసు నమోదు చేశారు. ?రాజ్యలక్ష్మినగర్‌లో అక్రమ నిర్మాణం కూల్చుతుండగా ద్వారంపూడి అడ్డుకున్నారని కేసులో పేర్కొన్నారు. ?ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డితో పాటు మరో 24 మందిపైనా కేసు నమోదు చేశారు. మాజీ కార్పొరేటర్ సూరిబాబు అక్రమ నిర్మాణాలను తొలగించారు. ?కూల్చివేత సమయంలో అధికారులతో ద్వారంపూడి ఘర్షణకు దిగారు. గతంలో అన్నీ తానై వ్యవహరించిన నేత.. ఇలాంటి ఎన్నో కేసుల్లో నిందితుడిగా చేరపోవటంతో ద్వారంపూడి అనుచరులు కూడా ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం.మరోవైపు.. రేషన్ బియ్యం స్కామ్‌ను ఏపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ స్కామ్‌లో కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడికి ఉచ్చు బిగుస్తోంది. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడలో మకాం వేసి.. వరుసగా తనిఖీలు నిర్వహించారు. సిటీతో పాటు పోర్టులో స్వయంగా మంత్రి నాదెండ్ల తనిఖీలు చేశారు. కాకినాడ పోర్టులో అశోక్ ఇంటర్నేషనల్, హెచ్ వన్ గోడౌన్లలో భారీగా రేషన్ బియ్యం గుర్తించారు. ఆ బియ్యాన్ని ఆఫ్రికాకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం అందుకుని అధికారులు.. రెండు గోడౌన్లు సీజ్ చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా అంతా.. ద్వారంపూడి ఫ్యామిలీ కనుసన్నల్లో జరిగిందటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయిజకాకినాడ పోర్టును ద్వారంపూడి.. తన అక్రమాలకు అడ్డాగా మార్చుకున్నాడని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ద్వారంపూడి అరాచకాలు చూసి తానే ఆశ్చర్యపోయానని చెప్పుకొచ్చారు. తనిఖీలు పూర్తి అయ్యేంత వరకూ పోర్టు నుంచి బియ్యం రవాణాను నిలిపివేశారు. రాష్ట్రంలో పేదల పొట్ట కొట్టి అదే రేషన్ బియ్యాన్ని ఆఫ్రికన్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారని మండిపడ్డారు. పౌరసరఫరాల శాఖ సంబంధించి శాఖపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని మంత్రి అన్నారు. పూర్తిస్థాయి పరిశీలన జరిపాక.. సీఐడీతో విచారణ కూడా జరిపిస్తామని నాదెండ్ల స్పష్టం చేశారు.వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి.. ఓ దళిత మహిళతో అక్రమ సంబంధంలో ఉన్నారని.. జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ షాకింగ్ కామెంట్స్ చేశారు. దళిత మహిళకు పుట్టిన బిడ్డను.. ద్వారంపూడి ఒళ్లో కూర్చోపెట్టుకుని తలనీలాలు కూడా తీయించారని ఆరోపించారు. తనకు గుర్తింపు కావాలని ఆమె ప్రశ్నించడంతో వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇంటి బయట 28 కెమెరాలు పెట్టి.. కారులో సైతం ట్రాకింగ్ డివైజ్‌లు పెట్టారని చెబుతున్నారు. ఇది రాజకీయం అంశం లాగా కాకుండా.. ఓ మహిళకు జరుగుతున్న అన్యాయంపై మాట్లాడుతున్నామన్నారు బొలిశెట్టి. జనసేన ఆమెకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ద్వారంపూడి పతనాన్ని ఆయనే రాసుకున్నారని రాజకీయనిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేయటంతో పాటు కొన్ని సందర్భాల్లో జనసైనికులపైనా దాడులు చేయించారనే వార్తలు వినిపించాయి. అంతేకాదు.. ఓ అడుగు ముందుకేసిన మాజీ ఎమ్మెల్యే.. పిఠాపురంలో పవన్ కల్యాణ్‌ను ఓడించి తీరుతామని చాలెంజ్ చేశారు. ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా ఎక్కడ నుంచి పోటీ చేయాలో నిర్ణయం తీసుకునే అధికారం పవన్ కల్యాణ్‌కు లేదని విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే చంద్రబాబు టిక్ పెట్టాలని.. ఎంపీగా పోటీ చేయాలంటే అమిత్ షా టిక్ పెట్టాలని ఎద్దేవా చేశారు. ఓ పార్టీకి అధ్యక్షుడిగా ఉండి..పవన్ కళ్యాణ్‌కి ఈ కర్మ ఏంటని ప్రశ్నించారు. అంతేకాదు.. ఏపీ ప్రజలు రెడ్లనే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా గెలిపించాలని అనుకుంటున్నారంటూ ద్వారంపూడి చేసిన వ్యాఖ్యలు అప్పట్లో సంచలనంగా మారాయి.మొదటి నుంచి ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి తీరుపై పవన్‌కల్యాణ్ గుర్రుగానే ఉన్నారు. ఇలాంటి నేతల వల్లే రాజకీయాలు భ్రష్టుపడుతున్నాయని విమర్శించారు. గత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పవన్.. ద్వారంపూడిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. ఆయన చేస్తున్న ఇల్లీగల్ వ్యాపారాలు చేస్తున్నారని.. ఆయన ఆటలు సాగనివ్వమంటూ హెచ్చరించారు. ద్వారంపూడి అధఃపాతాళానికి తొక్కేస్తానని.. లేకుండా పేరు మార్చుకుంటానంటూ తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారు పవన్‌వైసీపీ అధికారంలో ఉండగా ద్వారంపూడి చాలా అంశాల్లో అవినీతికి పాల్పడ్డారంటూ ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వం పేదలకు అందిస్తున్న బియ్యాన్ని సముద్ర మార్గం గుండా ఆఫ్రికన్ దేశాలకు ఎక్స్‌పోర్టు చేస్తూ కోట్లు గడిస్తున్నారని అప్పట్లో ప్రతిపక్షాలు విమర్శించారు. అధికారంతో పాటు అంగబలం ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి.. గత ప్రభుత్వ హయాంలో తనపై ఎలాంటి కేసులూ లేకుండా జాగ్రత్త పడ్డారు. ఇప్పుడు సీన్ మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. వస్తున్న ఆరోపణలు, నమోదవుతున్న కేసులతో సదరు నేత ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్నారట. పోనీ.. అధిష్టానం నుంచి తనకు ఏదైనా సహాయం అందుతుందని ఆశించినా.. ద్వారంపూడి విషయంలో జగన్ అంటీముట్టనట్లుగా ఉంటున్నారని ఆ పార్టీ నేతలే చెప్పుకుంటున్నారు. భవిష్యత్‌లో ఆయన మరిన్ని ఆరోపణలు ఎదుర్కొనే అవకాశాలు లేకపోలేదని రాజకీయవర్గాలు చర్చించుకుంటున్నాయి.

# 78 వా స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల





అనంతపురం, ఆగష్టు 15 (: కొప్పలకొండ, అనంతపురం జిల్లా నందు 78 స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు శ్రీమతి శాంతాబాయి గారి అధ్యక్షత వహించి స్వతంత్ర పోరాటంలో ప్రాణాలు అర్పించిన వందమంది వీరుల పేర్లను ప్రస్తావించారు. జలియన్వాలాబాగ్ దుర్ఘటనలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని ప్రతి సంవత్సరము కొందరి పేర్లు మాత్రమే తెలుసు. మనకు తెలియని వారు చాలామంది ఉన్నారని వారందరి ప్రతి జాతీయ పండగ రోజు స్మరించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ,ముఖ్య అతిథులుగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ గోపాల్ నాయక్ గారు హాజరై స్వేచ్ఛ స్వాతంత్రం దేశభక్తి పై ఉపన్యాసం చేశారు

దేశభక్తి గేయాన్ని పాడారు, జెవివి అనంతపురం జిల్లా కార్యదర్శి : కృష్ణ నాయక్ గారు స్వాతంత్ర్యం రావడానికి కృషిచేసిన దేశ నాయకులను గురించి ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తులతో అతలాకుతలం

**ప్రజల ప్రాణ,ఆస్తి నష్టంవరదలపాటు**

**వయనాడ్ మిగిల్చిన విషాదం అపారం**

న్యూఢిల్లీ,ఆగస్ట్15: దేశవ్యాప్తంగా భారీవర్షాలు,వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. వయనాడ్ సహా ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో రెండోదఫా వరదలు ఆ రాష్ట్రాలను కుంగదీస్తున్నాయి. ఎందరో వరదల్లో కొట్టుకుపోతున్నారు. సహాయక చర్యలు అందక అనేకులు ఇక్కట్లు పడుతున్నారు. వివిధ రాష్ట్రాల్లో ఇటీవలి వర్షాలకు వరద నష్టం విపరీతంగా ఉంటోంది. సాయం కోసం మళ్లీ కేంద్రం వైపు చూడాల్సిన ఆగత్యం ఏర్పడింది. దేశస్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న వేళ అనేకులు నీటిలోనే గడపాల్సిన దుర్గతి పట్టింది. ఇలాంటి దుస్థితి పోయేలా దేశాన్ని విపత్తు నిర్వహణా రంగంలో పటిష్టం చేసుకోవాల్సి ఉంది. ఇటీవలి కాలంలో ఉత్తరాది, దక్షిణాది అన్న తేడా లేకుండా వరదలు ముంచెత్తాయి. భారీ వర్షాల మూలంగా పెద్దయెత్తున నీరు వచ్చి చేరుతుండడంతో ప్రధానమైన డ్యాముల గేట్లను తెరవాల్సి రావడంతో దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధనం లో చిక్కుకుని విలవిల్లాడుతున్నాయి. వయనాడ్ విషాదం అంతాఇంతా అని చెప్పలేం. వందకు పైగానే ఆచూకీ లేదు. ఎక్కడ కొట్టుకు ఓయారో జాడలేదు. కేంద్రం విదిలింపులపై రాష్ట్రాలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. విపత్తుల సమయంలో ఇలాంటి విమర్శలకు తావులేకుండా స్వతంత్ర వ్యవస్థ రంగంలోకి దిగి ప్రజలను కాపాడడంతో పాటు, సహాయాక చర్యల్లో నిమగ్న మయ్యేలా ఉంటే విమర్శలకు ఆస్కారం ఉండదు. ఎంతగా నీరు వచ్చినా అంతా సముద్రం పాలయ్యింది. అన్నింటికి మించి వరదల్లో ప్రజలు మునిగినా పాలకులు వారిపట్ల కనీస దయను కూడా ప్రకటించడం లేదు. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, విరిగిపడుతున్న కొండ చరియలు, తెగిపోయిన రోడ్లు సాధారణ పౌర జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. లోతట్టు ప్రాంత ప్రజలను సకాలంలో సహాయక శిబిరాలకు తరలిం చడం, ప్రాణ నష్టాన్ని తగ్గించగలగడం అన్నది ఇలాంటి సమయాల్లో ముఖ్యం. పునరావాస శిబిరాల్లో బాధితులకు మంచినీరు, ఆహారం, మందులు వంటి కనీస సదుపాయాలు కల్పించడం, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం కూడా ముఖ్యమే. ప్రత్యేక యంత్రాంగం ఉండివుంటే వెంటనే రంగంలోకి దిగి యుద్ధ ప్రాతిపదికపై సహాయక చర్యలు చేపట్టే వీలుంటుంది. విపత్తు నిర్వహణ అన్నది ఉమ్మడి వ్యవహారంగా ఉంటనే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తక్షణం ఆదుకునేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీనికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసుకోవాలి. ప్రత్యేకంగా నిధులను సమకూర్చాలి. లేదా కేంద్ర,రాష్ట్రాలు ఉమ్మడిగా నిధులు సమకూర్చాలి. అలాగే దీనిని సైన్యంలో ఒక భాగంగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. భారత్ లాంటి దేశానికి ఇది తక్షణావసరమని పాలకులు గుర్తించాలి. ఇప్పటివరకు జరిగిన అనేక విపత్తులను దృష్టిలో పెట్టుకుని తగిన తర్ఫీదు ఇచ్చి స్వయం శక్తిగా దీనిని రూపొదించాలి. దేశంలో ఎక్కడ ఏ మూలన ఎలాంటి ఉపద్రవం వచ్చిపడినా తక్షణం రంగంలోకి దిగేలా అన్ని రాష్ట్రాల్లో సన్నద్ధంగా ఉండేలా చూడాలి.

# వైకాపా కేంద్ర కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

తాడేపల్లి.వైయస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. జాతీయ జెండాను వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు వైయస్.జగన్ ఆవిష్కరించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి ప్రతిపక్ష నేత లేళ్ల అప్పిరెడ్డి, ఎంపీ వై వి సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు, విడదల రజని, కారుమూరి నాగేశ్వరరావు, మెరుగు నాగార్జున, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, మాజీ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు మల్లాది విష్ణు, పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.

# అంబేద్కర్ భవన్లో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

కమాన్ పూర్,రామగుండం కార్పొరేషన్ గోదావరిఖని లోని అంబేద్కర్ భవన్లో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని, పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో , గోదావరిఖని పట్టణంలోని తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్, స్థలం లో,ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నాతరి రాయమల్లు జాతీయ జెండాను ఆవిష్కరించారు, అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నా తరి రాయ మల్లు తోపాటు, ట్రస్ట్ లీగల్ అడ్వైజర్ గొర్రె రమేష్, ట్రస్ట్ జనరల్ సెక్రెటరీ బొంకూరి మధు, ట్రస్ట్ కోఆర్డినేటర్ మైస రాజేష్, వైస్ చైర్మన్ శనిగరపు రామస్వామి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం పెద్దపల్లి జిల్లా కో కన్వీనర్ పెగడపల్లి నారాయణ, మంథని మండల కన్వీనర్ కాసిపేట పోచం తోపాటు పలువురు పాల్గొన్నారు,

# బద్వేల్ లో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**జాతీయ జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే డాక్టర్ సుధా**

బద్వేలు ,78 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బద్వేల్ నియోజక వర్గ శాసన సభ్యురాలు డా.దాసరి సుధా ప్రభుత్వ ఆసుపత్రి నందు,బద్వేల్ మున్సిపాలిటీ శ్రీ నాగభూషణం కళాశాల నందు ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించడం జరిగింది.అనంతరం మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా మన దేశానికి స్వాతంత్రం వచ్చింది అని తెలిపారు. ఈ రోజు మన దేశం ప్రపంచం లోని ఒక బలమైన 5 వ ఆర్థిక దేశంగా అవతరించి అభివృద్ధి వైపుగా దూసుకెళ్తోంది. ఈ రోజు మన దేశం అన్ని రంగాలలో ఇతర దేశాలకు ఆదర్శంగా ఉంది అని తెలిపారు.కావున ప్రతి ఒక్కరూ దేశ భక్తిని పెంపొందించుకుని దేశ అభివృద్ధి కి పాటుపడాలని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి,వైస్ చైర్మన్ సాయి ,గోపాల్ స్వామి, అందరూ కౌన్సిలర్లు,ముఖ్య నాయకులు,అధికారులు,ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంటువ్యాధుల నివారణకు చర్యలు

**ప్రజల్లో చైతన్యం వచ్చేలా కార్యక్రమం**

విజయవాడ,ఆగస్ట్15: గ్రామల్లో అంటువ్యాధుల నివారణకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటు న్నారు. ఇటీవలి వర్షాలకు పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సహాయక చర్యలు తీసుకున్నారు. పచ్చదనానికి తోడు పరిశుభ్రతతో ప్రజలకు వైద్యం చేరువ చేసే కార్యక్రమం ఊపందుకుంది. చంద్రబాబు అధికారం చేపట్టాక వరుస సమీక్షలతో కార్యక్రమాలను పట్టాలకు ఎక్కించే ప్రయత్నంలో ఉన్నారు. ఆస్పత్రుల్లో పెద్ద ఎత్తున వసతుల కల్పనతో పరిస్థితి మారుతోంది. వ్యాధి నిరోధక టీకాలైన మిజిల్స్, రుబెల్లా తదితర వ్యాక్సిన్‌ల ద్వారా వ్యాధినివారణకు ప్రభుత్వం నడుం బిగించింది. నెలల నుంచి 15 ఏళ్లలోపు వయస్సుగల పిల్లలకు మిజిల్స్, రుబెల్లా, తట్టు టీకాలను వేయించవచ్చని వైద్యాధికారులు తెలిపారు. గతంలో వేయించిన పిల్లలకు వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో అదనపు డోసును వేయించవచ్చని వైద్యాధికారులు స్పష్టం చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలతో పాటు జిల్లా వైద్యాధికారులు వ్యాక్సినేషన్ పై ప్రచారం జరుపుతున్నారు. జిల్లాల్లోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, బస్తీల్లో పోస్టర్లు, కరపత్రాలతో పాటు అవగాహన సదస్సుల ద్వారా టీకాలపై ప్రచారం, అవగాహన కల్పించారు. వ్యాధులు వచ్చిన తరువాత దవాఖానలకు పరుగెత్తడం కంటే రోగాలు రాకుండా ముందుజాగ్రత్త పడడమే ఉత్తమమని, అందుకోసం వ్యాధినిరోధక శక్తిని పెంచే టీకాలు వేయించాలని వైద్యులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. మిజిల్స్, రుబెల్లా టీకాలు వేయడం వల్ల వ్యాధులు రాకుండా ఉంటుందని పలు అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు చెబుతున్నారు. వ్యాధులు రాకుండా ముందస్తు వ్యాక్సినేషన్ చేయించుకోవడం, ఒక వేళ రోగాలు వ్యాపిస్తే వాటిని ప్రారంభదశలోనే గుర్తించి, సరైన చికిత్స చేయడం తదితర వాటిపై వైద్యాధి కారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ టీకాల వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని, వాటిపై ఎలాంటి అపోహలు, అనుమానాలు పెట్టుకోనవసరంలేదని వైద్యాధికారులు స్పష్టం చేశారు. గతంలో వేయించుకున్నవారు మళ్లీ వేయించుకోవచ్చని సూచిస్తున్నారు.

# యూనిఫామ్ సివిల్ కోడ్ ఆవశ్యకత ఉంది

**మరోమారు ఎర్రకోట వేదికగా ప్రధాని ప్రస్తావన**

న్యూఢిల్లీ,ఆగస్ట్15: ఎర్రకోట మీదుగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన ప్రసంగంలో యునిఫామ్ సివిల్ కోడ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ కోడ్‌ని తీసుకురావాల్సిన సమయం వచ్చిందని స్పష్టం చేశారు. దేశాన్ని విభజించే చట్టాలకు కాలం చెల్లిందని, అలాంటి వాటిని పక్కన పెట్టేయాల్సి అవసరముందని తేల్చి చెప్పారు. యూసిసి విషయంలో సుప్రీంకోర్టు కూడా సానుకూలంగా ఉందని, త్వరలోనే ఈ కలను సాకారం చేసుకుంటామని అన్నారు. దేశ ప్రజలంతా ముందుకు వచ్చి యునిఫామ్ సివిల్ కోడ్‌పై తమ అభిప్రాయాలు చెప్పాలని సూచించారు ప్రధాని మోదీ. సెక్యులర్ కోడ్‌ని తీసుకొస్తే తప్ప మతపరమైన వివక్ష పోదని అభిప్రాయపడ్డారు. 'యునిఫామ్ సివిల్ కోడ్‌పై సుప్రీంకోర్టు ఎన్నోసార్లు చర్చలు జరిపింది.

## కాలేయ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి జనసేన ఆర్థిక సహాయం.



శ్రీ ప్రస్థానం న్యూస్ కోవెలకుంట్ల : సంజామల మండలం ముక్కమల్ల గ్రామానికి చెందిన సుకన్య అమ్మాయి కాలేయ వ్యాధితో బాధపడుతున్నది. ఈ సమాచారం తెలుసుకున్న జనసేన నియోజకవర్గ కో ఆర్డినేటర్ పత్తి సురేష్ బాబు ఆధ్వర్యంలో సుకన్య కుటుంబ సభ్యులకు గురువారం కోవెలకుంట్ల జనసేన పార్టీ కార్యాలయంలో రూ. 20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ కష్టాలు, ఆపదలలో ఉన్నవారికి సహాయం చేయాలని ఆలోచన జనసేన అధ్యక్షులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తితోనే అవలంబించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, గురప్ప, కిట్టు,భోధనం ఓబులేసు,విజయ్, పెద్దయ్య, షేక్షావలి, నీలి రమేష్, చెన్నయ్య, శ్రీను, బుజ్జి, చంద్రశేఖర్, రాజు, విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రెప రెప లాడిన మువ్వన్నెల జాతీయ జెండా.





శ్రీ ప్రస్థానం న్యూస్ కోవెలకుంట్ల : కోవెలకుంట్ల మండలం లోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ కార్యాలయాలలో 78 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం నాడు ఘనంగా నిర్వహించారు . కోవెలకుంట్ల లో ప్రధాన కార్యాలయాలు అయిన గ్రామా పంచాయతీ కార్యాలయం లో సర్పంచ్ మెట్ల సరళ జెండా ఎగురవేదం జరిగింది .మండలం లోని యం పి డి ఓ , తహసీల్దార్ ,సర్కిల్ ఇన్స్పెక్టర్ , సబ్ ఇన్స్పెక్టర్ , అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఆయా అధికారులు జండా ఎగురవేసి దేశ భక్తిని చాటుకున్నారు . కోవెలకుంట్ల మండలం లోని స్థానిక గాంధీ నగర్ లో ఉన్న మండల ప్రజా పరిషత్ ప్రభుత్వ పాఠశాల యందు ప్రధానోపాద్యాలు మరియు ఉపాద్యాలులు మనోహర్ ఆధ్వర్యంలో ఆ పాఠశాల చైర్మన్ నాగేశ్వర రావు జెండా ఆవిష్కరించడం జరిగింది .ఈ కార్యక్రమంలో ఉపాద్యరాలు శిరోమణి విద్యావాలింటిర్ పద్మావతి పాఠశాల విద్యార్థిని విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు .కోవెలకుంట్లలోని జనసేన నియోజకవర్గం కార్యాలయంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ పత్తి సురేష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది .

## ఉత్తమ సేవలకు పురస్కారాలు .

శ్రీ ప్రస్థానం న్యూస్ కోవెలకుంట్ల : కోవెలకుంట్ల మండలంలోని లోని వివిధ శాఖలలో పని చేస్తున్న అధికారులకు స్వాతంత్ర్యం దినోత్సవ సందర్భంగా గురువారం నాడు ఆర్ ఓ బి శాఖ మంత్రి వర్యులు బి. సి జనార్దన్ రెడ్డి మరియు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా వారు చేసిన సేవలకు గాను ఉత్తమ సేవా అవార్డులు ప్రదానం చేయడం జరిగింది . కోవెలకుంట్ల మండల యం .పి డి ఓ సయ్యాదున్నీసా , అగ్రికల్చరల్ ఆఫీసర్ నిరంజన్ మరియు ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ రామ్మోహన్ వారికీ అవార్డులు ప్రదానం చేయడం జరిగినది .అనంతరం ఆయా శాఖల సిబ్బంది వారికీ అభినందనలు తెలియజేసారు .







# ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.

### జాతీయ జెండాను ఎగరవేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు.









నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల పరిధిలోని 41 గ్రామాలలో ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. గురువారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో, తహశీల్దార్ కార్యాలయంలో, ఎంపీడీవో కార్యాలయంలో, వ్యవసాయ కార్యాలయంలో, ఫారెస్ట్ కార్యాలయంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, పోలీస్ స్టేషన్ లో, గ్రంథాలయంలో, సచివాలయాలలో, పశు వైద్య కేంద్రాలలో జాతీయ మువ్వన్నెల జెండాను అధికారులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు ఎగురవేశారు. ఈ సందర్భంగా పాలు పాఠశాలలలో నిర్వహించిన క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు నాయకులు, ప్రజా ప్రతినిధులు బహుమతులను అందజేశారు. ముఖ్యంగా ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం వీర రాఘవరెడ్డి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోమునుపటి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఉత్తమ ఫలితాలు సాధించిన ఇద్దరు విద్యార్థులకు నగదు రూపకంగా బహుమతులు అందజేశారు. అలాగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విద్యా జ్యోతి పథకం కింద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కెనరా బ్యాంకు వారు స్కాలర్ షిప్ రూపంలో నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ మనకు స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన స్వాతంత్ర్య సమరయోధుల గాధను వారు మన దేశానికి చేసిన సేవలను, కృషిని, పట్టుదలను, ప్రాణ త్యాగాలను గురించి పూర్తిగా విద్యార్థులకు తెలియజేశారు. దేశానికి వారు చేసిన సేవల గురించి కొనియాడారు. అనంతరం ఆయా పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులు స్వాతంత్ర్య నృత్య కళలతో అలరించారు.

# ఘనంగా 78 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



దొర్నిపాడు,ఆగస్టు:15, శ్రీ ప్రస్థానం న్యూస్:- మండలంలో 78 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.. గురువారము వారం నాడు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని మండల తాసిల్దార్ కార్యాలయంలో తహశీల్దార్,ఎస్.సుభద్ర, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి. అమర్నాథ్ రెడ్డి, జడ్పీటిసి సభ్యులు శకుంతల రెడ్డి,ఎంపీడీఓ.శ్రీనివాసులు,పోలీస్ స్టేషన్లో. ఏ ఎస్సై. మౌలాలి, ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్.నాగేంద్ర, పశు వైద్య కేంద్రాలలో ను దొర్నిపాడు సహకార సంఘం సొసైటీ కార్యాలయంలో సి.ఈ ఓ. సిద్ధి హర్ష వర్ధన్,గుండుపాపల సహకార సంఘం సొసైటీ కార్యాలయంలో, సీ ఈ ఓ. సుబ్బారావు, అదేవిధంగా మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లోనీ సర్పంచ్,లు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జెండా వందనము స్వీకరించిన పిదప విద్యార్థులచే జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో త్యాగ దనుల ఫలితంగానే నేడు మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని,కావున వారి జ్ఞాపకాలను స్మరించుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు.స్వాతంత్రం సాధించిన నేపథ్యంలో దేశం లో నీ ప్రజలు అందరూ కలిసి మెలిసి కులమతాలకు అతీతంగా జెండా పండుగను వాడా వాడాల కనుల పండువగా సంబరాలు జరుపు కోవడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. సమర యోధులు పోరాట బలం అమర వీరుల త్యాగఫలితం బ్రిటిష్ పాలకుల పై తిరుగు లేని విజయం మన స్వాతంత్ర్య దినోత్సవం..సామ్రాజ్యవాదుల సంకెళ్ళు తెరుచుకొని భరత జాతి విముక్తి పొందిన చరిత్రాత్మక మైనా రోజు ఆగస్ట్ 15 వ తేదీ కనుక స్వాతంత్ర్యం దినోత్సవాన్ని నిర్వహించుకున్న ప్రతీ ఏడాదీ వారి త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిందేనని అన్నారు.మనం అందరం కలిసి ఉద్యమ స్ఫూర్తితో దేశాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాద్యక్ష్యులు భూమా బ్రహ్మానంద రెడ్డి, మండల టిడిపి నాయకులు సందీప్ రెడ్డి,మాజీ సింగిల్ విండో చైర్మెన్,లు సిద్ధి సత్యం, బబ్బురి వెంకట స్వామి,మండల సర్వేయర్ చిన్న మల్లయ్య, పశు వైద్యాధికారులు,మండల సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి,లు గ్రామ సర్పంచులు,ఎం.దేవ మని, పి.మాధవి లత, ఎల్.మాదవి,బి.ఉమా దేవి,బి. పద్మిని అభిలాష్ రెడ్డి, భూమా ప్రభాకర్ రెడ్డి,బి. శివ రామి రెడ్డి,జీ.బాల సుబ్బయ్య, జీ.వేంకటే శ్వర్లు,ఎం.బాలయ్య, గ్రామాల్లోని టిడిపి నాయకులు,కొత్త పల్లి సురేంద్ర, లింగుట్ల వెంకట నాయుడు, జీ.కృష్ణా రెడ్డి,కాశీ విశ్వనాథ్ రెడ్డి,బి.వెంకట రామి రెడ్డి, బాలి రెడ్డి, ఎన్.లోక్ నాథ్ రెడ్డి,పి.శేఖర్, రామారావు, పి.శ్రీనివా సులు,సహకార సంఘం సిబ్బంది, చిన్నయ్య, వ్యవసాయ శాఖ సిబ్బంది, వెలుగు సిబ్బంది,సహకార సంఘం రైతులు సచివాలయం సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది, వెలుగు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు...

# శ్రీ రవీంద్ర భారతి పాఠశాల లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



శ్రీ ప్రస్థానం : పాణ్యం ఇన్చార్జి :గడివేముల మండలంలోని శ్రీ రవీంద్ర భారతి పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా పాఠశాల యాజమాన్యం వారు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో,సుబ్బారాయుడు, రాఘవేంద్ర, వ్యాయమా ఉపాధ్యాయులు సిధార్థ్ రాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింతల వంశీకృష్ణ, ఈ సందర్భంగావారు మాట్లాడుతూ.... భారతదేశం బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సుదీర్ఘ పోరాటం చేసి 1947, ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందింది. అందుకే భారతీయులు ప్రతి సంవత్సరం ఈ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటారు అన్నారు. ప్రతి ఒక్క పౌరుడు లింగ, ప్రాంత, కుల, శ్రామిక దోపిడీ, వంటి వివక్షత కు గురి కాకుండా ప్రతి ఒక్కరు స్వేచ్ఛ గా జీవనం సాగించాలి అన్ని పేర్కొన్నారు అలాగే స్వాతంత్ర దినోత్సవ విశిష్టత ప్రాముఖ్యత ను తెలిపారు అనంతరం విద్యార్థులకు వివిధ సాంకృతిక కార్యక్రమాలు నిర్వహించారు అలాగే వివిధ ఆటల పోటీలో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించిన అనంతరం మిఠాయి స్వీట్స్ స్కూల్ విద్యార్థులకు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయ విద్యార్థి విద్యార్థినిలు పాల్గొన్నారు



## , రేపరెపలాడిన మువ్వన్నెల జాతీయ జెండా





సంజామల/ ఆగస్టు 15 శ్రీ ప్రస్థానం న్యూస్: సంజామల మండల గ్రామంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 78 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా మువ్వ నెలజాతీయ జెండా రెపరెపలాడింది. ఏవీహెచ్ లో స్పెషల్ ఆఫీసర్/ఏది డాక్టర్ రామ్మోహన్ రావు, ఎమ్మార్వో కార్యాలయాల్లో ఎమ్మార్వో అనిల్ కుమార్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయకుమార్ రెడ్డి, సర్పంచ్ రాజేశ్వరమ్మ, పోలీస్ స్టేషన్లో ఏ ఎస్ ఐ నాగరాజు, పీహెచ్సీలో డాక్టర్ వినోద్ కుమార్ ఆయా పాఠశాలలో హెచ్ఎంలు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వచించారు. చీఫ్ గెస్ట్ గా సర్పంచ్ రాజేశ్వరమ్మ, ఎస్ఎంసి చైర్మన్ నాగరాజు పాల్గొన్నారు. విద్యార్థినుల పిరమిడ్ విన్యాసాలు ఆ కట్టుకున్నాయి. స్వతంత్ర సమరయోధుల సేవలు చిర శర్మనియామని, వారి అడుగుజాడల్లో విద్యార్థులు ముందుకు సాగాలని సర్పంచ్ ఎస్ఎంసి చైర్మన్ ఆకాంక్షించారు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## త్యాగధనుల పోరాట ఫలితమే స్వాతంత్ర్యం



శ్రీ ప్రస్థానం-గడివేముల :- ఆగస్టు 16:- ఎందరో మహనీయులు, త్యాగధనులు పోరాట ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని గడివేముల మండల ఉపాధ్యక్షులు కాలునాయక్ అన్నారు.గ్రామం లోని పాఠశాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జాతీయ జెండాను ఎగురవేసి అందరికీ స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్య సముపార్జనలో త్యాగం చేసిన అమరులను ఈసందర్భంగా కాలు నాయక్ గుర్తు చేసుకుంటూ జాతికి అంకితమైన నాయకుల వీర గాధలను వివరించారు.

## ఘనంగా 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



సంజామల/ఆగస్టు 15 శ్రీ ప్రస్థానం న్యూస్: కానాల గ్రామంలో జెడ్ పి పి హై స్కూల్ లో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను హెచ్ఎం అరుణ కుమారి జడ్పీ హైస్కూల్ చైర్మన్ వై కొండయ్య పిటి మౌలాలి జెండాను ఎగరవేశారు. ప్రధానోపాధ్యాయులు శంకరయ్య వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు

## ఉత్తమ సేవలకు సత్కారం



కానిస్టేబుల్ మాదుగుల చెన్నయ్య కు స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా నంద్యాల డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గురువారం " రాష్ట్ర రోడ్డు భవనాలు ' పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పలువురు తోటి ఉద్యోగులు మరియు పాత్రికేయులు నాయకులు వారి సేవలను కొనియాడి, అభినందించారు.

శ్రీ ప్రస్థానం - నంద్యాల, ఆగస్టు 15:-పోలీస్ విభాగాల్లో జిల్లాలో ఉత్తమ సేవలను అందించిన గడివేముల ఎస్సై బిటి వెంకటసుబ్బయ్యకు మరియు



EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757